# కవుతరం నూతన రైల్వేస్టేషన్

(14/6 కి. మీ. వద్ద)

ప్రారంభోత్సవ సందర్భంలో సమర్పించిన

# నివేదిక.

## పూర్వం :

1907 సం॥రంలో పూర్తిఅయిన బెజవాడ-బందరు రైల్వేలైనుతో బాటు "కవుతరం" రైల్వేస్టేషన్ యేర్పాటు అయింది. అది గ్రామానికి షుమారు రెండుమైళ్ళ దూరంలో వుంది. నాడు గుడ్లవల్లేరు స్టేషన్ లేదు. అందుచేత గుడ్లవల్లేరు, చిత్రం, మామిడికోళ్ళ, కూరాడ, దగ్గుమిల్లి, విన్నకోట, పెసరమిల్లి, వెణుతురుమిల్లి, డోకిపర్రు, ముదినేపల్లి, గురజ గ్రామస్థులకు సమీపంగా వుండునట్లును, రహదారి పడవల మీద బందరు, కైకలూరు తాలూకాల గ్రామాదులనుంచి వచ్చే ప్రయాణీకుల సౌకర్యార్థము, ముఖ్యంగా ఆంధ్ర లక్ష్మి ఇండస్ట్రియల్ కంపెనీ ఉత్పత్తి చేసే ఉప్పుడు, పచ్చి బియ్యం యెగుమతి చేయడానికి అందుబాటులో ఉండుటకు మధ్యస్థంగా ఆ స్టేషన్‌ను యేర్పాటు చేశారు.

కాని ఆస్టేషన్ గ్రామానికి చాల దూరమందు వుండుట వల్ల చీకటి కాలమందు, వర్షాకాలమందు గ్రామస్థులు నానా బాధలు పడవలసి వచ్చేది, అందుచేత శ్రీ వీరపనేని గోపాల

కృష్ణయ్య చౌదరిగారి పూనికతో కృష్ణాజిల్లా ప్రయాణీకుల సంఘమొకటి యేర్పడి, దాని ఆధ్వర్యమున గ్రామమునకు సమీపంలో ఉండునట్లు "కవుతరంగేటు" స్టేషన్‌ను 1939 సెప్టెంబరు 4 వ తేదీన యేర్పాటు చేయించుకొనటం జరిగింది. ఆ సంఘానికి శ్రీ వీరపనేనివారే శెక్రటరీగా వుండి యీ గ్రామములోనే దాని కార్యాలయమును పెట్టి నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధకాలమందు యీగేటు స్టేషన్ మూయబడి, యుద్ధానంతరం అరిగి తెరువబడింది. గేటుస్టేషన్ యీ గ్రామస్థులకు అందుబాటులో వుండుటయేగాక చుట్టుపట్ల గ్రామాల ప్రజలకుగూడ అందుబాటులో వుండి బహుళ ప్రజోపయోగంగా వుంది. ప్రయాణీకుల సౌకర్యార్థం శ్రీ కానూరి రామమూర్తిగారు (తండ్రి బ్రహ్మయ్యగారు) 1948 సం॥రంలో అయిదువేల రూపాయలు వ్యయపరచి విశ్రాంతి భవనమును కట్టించిరి. "కవుతరంగేటు" స్టేషను యేర్పాటులో ప్రముఖ పాత్ర వహించి అవిరళ కృషిచేసిన గోపాల కృష్ణయ్య చౌదరిగారు ప్రశంసాపాత్రులు. ఆ తర్వాత వారు నడచిన బాటనే మేము నడిచాం. అదే మనగా గ్రామానికి సమీపంలో పక్కా-భవనములో కవుతరం పర్మనెంటు స్టేషన్ యేర్పడాలనటం. దానికి పరిస్థితులు అనుకూలించాయి ఆ పరిస్థితులు - మీటర్ గేజ్‌ను బ్రాడ్ గేజ్‌గా మార్చటం, కవుతరం మెయిన్ స్టేషన్ బిల్డింగ్స్ చాలభాగం శిథిలమవటం.

## ప్రస్తుతం :

నాడొక దివ్యదినం. అది 1960 అక్టోబరు నెలలో ఒక రోజు. సందర్భం - ఇద్దరి బంధువుల మధ్య జరిగిన యిష్టాగోష్టి, వారు ఒండొరులు బంధువులే కాదు. గ్రామస్థులుకూడా

వారు శ్రీనార్ల వెంకటేశ్వరరావుగారు, శ్రీ చాపరాల సుబ్బారావుగారు (తండ్రి సత్యనారాయణగారు) మీటరు గేజ్‌ను బ్రాడ్‌గేజ్ చేయుచున్నారు. శిథిలమైన కవుతరం మెయిన్ స్టేషన్ బిల్డింగ్సును మరల అచ్చటనే కట్టేదానికంటే గ్రామానికి సమీపంలో కట్టడం బాగుంటుంది-అని అన్నారు శ్రీ చాపరాలవారు. అందుకు, అందుకు నేను చేయగల సహాయం చేస్తానన్నారు-శ్రీ నార్లవారు కాని పంచాయతీ తీర్మానం కావాలన్నారు. అది నాటి కల.

ఆ విషయం నాటి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరైన శ్రీ పి రామసుబ్బారెడ్డి ద్వారా నాకు తెలిసింది గ్రామాభివృద్ధిని కాంక్షించే శ్రీ నార్ల పనిచేస్తా ననటంవల్ల, ఆపని వృథా కాదనిపించింది. అంతేకాక ఆ కల కల్ల కాకూడదని నా దృఢ సంకల్పం. ఎందుకంటే-ఈ తరుణంలో తప్ప మరెన్నటికి గ్రామానికి సమీపంలో పక్కా బిల్డింగ్సుతో కూడిన పర్మనెంటు స్టేషను నిర్మాణం కాదు. ఈవిషయమై యెవ్వరూ ప్రయత్నించలేదుగదా యని భావితరాలవారు నిందించుతారు. గత తరాలవారినుంచి ఉత్తేజాన్ని పొంది, భావితరాలవారికి సౌకర్యాలను సమకూర్చటం ప్రస్తుత తరంవారి విద్యుక్త ధర్మంగదా !

అందుచేత యీ స్టేషను సమస్య 1960 నవంబరు 12వ తేదీన పంచాయతీ అత్యవసర సమావేశంలోనికి తీసికొని రాబడింది "కవుతరంగేటు" స్టేషన్నే పర్మనెంటు పక్కా స్టేషన్‌గా నిర్మించవలసినదని పంచాయతీ కోరింది. ఆ పంచాయతీ తీర్మానమును 1960 నవంబరు 21వ తేదీగల ఉత్తరాన్ని పంచాయతీ ఆఫీసరు రైల్వే అధికారులకు, శ్రీ నార్లకు

పంపారు. అంతేగాక నేను గూడా వాటిని శ్రీ నార్లకు, శ్రీ పింగళి వీరరాఘవరావుగారికి (ఢిల్లీ) పంపుతూ 1960 నవంబరు 29 తేదీన వుత్తరాలు వ్రాసాను. అందుకు సమాధానంగా శ్రీ పింగళి వారి వద్దనుంచి ఉత్తేజాన్నిచ్చే ఉత్తరం (తే 19-12-60) వచ్చింది అదు తనకు తెలిసిన రైల్వే బోర్డు మెంబర్లతో మాట్లాడినట్లు. వారు యీ విషయమై సదరన్ రైల్వేవారికి తెలియజేస్తామని చెప్పినట్లు వ్రాసారు. శ్రీ పింగళివారి తోడ్పాటు గూడా వుందని శ్రీ నార్లకు తెలియజేసాను. శ్రీ నార్ల కృషి చేసారు.

గాని యెంతకాలానికి రైల్వే అధికారులనుంచి యే సమాధానం రాలేదు. గ్రామస్థులలో పూనిక అసలేలేదు. నూతన స్టేషను యేర్పాటు లేదనిపించింది. రైల్వేడిపార్టుమెంటు గుర్తించేటట్లు, ఆచరణాయోగ్యంగాను, అందరికి (మన చుట్టుపట్ల గ్రామస్థులకుగూడా) ఆమోదయోగ్యంగాను వుండేటట్లు ఆ ప్రపోజల్ వుండాలనుకున్నాను. అంతట 1961 జనవరి 27 వ తేదీన శ్రీ తాళ్లూరి నారాయణమూర్తిగారి మొదటి సంతకంతో గ్రామస్థులచేత ఒక మహాజన్ పిటీషను పెట్టించటం జరిగింది. అందు- "కవుతరం" "కవుతరం గేటు" స్టేషనులు రెంటిని యెత్తివేసి 14/6 కి. మీ. వద్ద మరొక నూతన స్టేషను యేర్పాటు చేయవలసిందన్ని, కవుతరం మెయిన్ స్టేషనువల్ల ప్రయోజనం పొందుతున్న పెసరమిల్లి, డోకిపర్రు ప్రజలుగూడా వచ్చుటకు వీలుగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయవలసినదని మొదలైన విషయాలను చేర్చాము. అంతేకాక యీవిషయం సుబోధక మగుటకుగాను ప్లానులను తయారుచేసి రైల్వే అధికారులకు పంపాము. ఇలా పంపినట్లు శ్రీ నార్ల, శ్రీ పింగళి వారికి తెలియజేస్తూ వాటి

కాపీలను గూడా పంపాము. ఈ సారి పింగళివారి కృషి ఫలించింది. ఈ విషయాన్ని పరిశీలించవలసినదని రైల్వేబోర్డువారు సదరన్ రైల్వేవారికి తెలియజేసారు. ఇలా తెలియజేస్తున్నామని మాకు 1961 మార్చి 1 వ తేదీన ఒక వుత్తరం వ్రాసారు. పై ఆజ్ఞలను పురస్కరించుకొని నూతన స్టేషను యేర్పాటుకు పరిశీలన ప్రారంభించుచున్నామని సదరన్ రైల్వే వారు 1961 మార్చి 21వ తేదీన మాకు ఉత్తరం వ్రాసారు. శ్రీ నార్ల రైల్వేడిప్యూటీ మంత్రి అయిన శ్రీ యస్. వి. రామస్వామి గారిని ఆ మార్చి నెలలోనే కలుసుకొని మాట్లాడటం, అంతట వారుగూడా నూతన స్టేషను విషయమై పరిశీలించుతున్నామని 1961 మార్చి 27వ, తేదీన శ్రీ నార్లకు ఉత్తరం వ్రాయటం జరిగింది. ప్రముఖ పత్రికా సంపాదకుడుగా గణుతికెక్కిన. మన నార్లవారు శ్రీ రామస్వామిగారికి చిరపరిచయులు. అంతేగాక రాజ్యసభసభ్యులుగా వుండటం, ఆంధ్ర మంత్రులతో చిరపరిచయం మన నార్లకు వుండటం యీసందర్భంలో గమనించదగినది.

రైల్వే అధికారులు 1964 ఏప్రియల్ 4వ తేదీన గ్రామం రానేవచ్చారు గ్రామస్థులను విచారించారు. స్థలాన్ని పరిశీలించి వెళ్ళారు. అప్పటినుంచి 14/6 కి.మీ. సమీపంలో భూములున్నవారిలో కొంతమందిలోమాత్రమే స్టేషన్ వ్యతిరేకత వచ్చింది. ఆమాత్రం వ్యతిరేకత వారిలో కలగటం సహజం. తమభూములకు రాదగినష్టపరిహారం రాదని వారిభయం. వారిలో ఒకరిద్దరుమాత్రం పూనుకొని 14/6 కి మీ వద్ద స్టేషన్ నిర్మించవద్దని, కవుతకం, కవుతరంగేటు స్టేషన్‌లు రెండూ వుండాలని, అలాలేనిచో మిగతా గ్రామాల ప్రజలు, కవుతకం ప్రజలు చాలయిబ్బందుల పాలౌతారన్న విషయాలతో కవుతరం, డోకి

పట్టు మొ॥ గ్రామాలనుంచి కొన్ని అర్జీలను రైల్వేఅధికారులకు పంపాను. ఆతర్వాత నేను బయలుదేరి 14/6 కి మీా వద్ద ఏర్పడబోవు నూతన స్టేషనువల్ల అందే అవసరాలు యెలాతీరుతాయో విశదపరుస్తూ చుట్టుపట్ల గ్రామాలప్రజలలో విరివిగా ప్రచారంచేశాను. వారు వాస్తవాన్నిగుర్తించి ఈ ప్రపోజల్‌కు సుముఖతజూపారు రైల్వేఅధికారులకు అర్జీలను కూడా పంపారు

రైల్వే అధికారుల ఆయ్కన్‌క్వయిరీ మరొకవైపున యీా గ్రామస్థులలో నూతనోత్సాహాన్ని కలుగజేసింది నూతన స్టేషనుకొఱకై కృషి చేయాల్సిందేనన్న అభిప్రాయం ప్రజలలో యేర్పడింది అందుకు ప్రధానంగా ముందుకువచ్చింది — శ్రీ కానూరి వెంకట్రామయ్యగారు. వ్యయప్రయాసలకు వెనుకాడవద్దని, తాను చేయగల పూర్తిసహాయం చేస్తానని వెంకట్రామయ్యగారన్నారు

మనగురువు, నెయ్యుడు, బంధువు, మనశ్రేయోభిలాషులు, ఇటీవలె మనల దుఃఖాంబుధిలోముంచి కీర్తిశేషులైన శ్రీ చెరుకువాడ వెంకటనరశింహం పంతులుగారు ఒకానొక కాలమందు యీా గ్రామం విచ్చేశారు, ఆసందర్భంలో యీా స్టేషను విషయం వారిసమక్షమున చర్చకువచ్చింది ఈ పని పూర్తిఅగుటకు తానుగూడా మెడ్రాసువస్తానని, మమ్ములను బయలుదేరమని ఉత్సాహపరచిరి 1964 జూన్ 8వ తేదీన వారు, వెంకట్రామయ్యగారు, తాళ్లూరి అప్పారావుగారు, నేను మెడ్రాసు వెళ్ళాము. బహుముఖప్రజ్ఞాశాలి, నిరంతరప్రజాసేవాతత్పరుడు, భారత్ సేవక్ సమాజ్ (మెడ్రాస్) జాయింట్ కన్‌వీనర్, రైల్వేసలహా సంఘసభ్యులు అయిన శ్రీ మాగంటి బాపినీడుగారిని కలుసుకునే మహాభాగ్యం మాకు కలిగింది.

మా రాకకు ముందే వారికి యీ విషయమై ఉత్తరం వ్రాశాం. శ్రీ బాపినీడుగారు సదరను రైల్వే అధికారులకు చిరపరిచితులు. వారూ, మేము రైల్వే ఆఫీసుకు వెళ్ళాము. ఆంధ్రస్టేటు గవర్నమెంటు అభిప్రాయంకొరకు స్టేషను ఫయిల్‌ను హైదరాబాద్ పంపామనిచెప్పారు జిల్లాకలెక్టర్ పంపున 1961 జూన్ 26 వ తేదీన గుడివాడ డిప్యూటీ తహశీల్దారు గ్రామంవచ్చి బహిరంగ విచారణ జరిపారు. ఆసందర్భంలో అచ్చట సమావేశమైన గ్రామస్థులు సమిష్టిగా ఒక స్టేటుమెంటును యిచ్చారు. అందు పంచాయితీ తీర్మానము ను గూడా ఉదహరించారు. అంతేగాక 14/6 కి.మీ. వద్ద స్టేషను ఏర్పాటుచేసినట్లయితే. డోకిపర్రు, పెసరమిల్లి గ్రామప్రజలకు గూడా సౌకర్యంగా వుండగలదని తెలియజేసారు, ఆవిచారణకు సంబంధించిన రిపోర్టే నూతన స్టేషను యేర్పాటుకు ప్రాతిపదిక. 1962 జులై 13 వ తేదీన గుడివాడలో మకాంచేసియున్న జిల్లాకలెక్టరు శ్రీ ఆర్. కె వేపాను కలుసుకున్నాము ఆసందర్భంలో శ్రీ అడుసుమిల్లి సుబ్బారావుగారు (గుడివాడ) జోనల్ సలహాసంఘం (రైల్వే) సభ్యునిహోదాలో పాల్గొన్నారు. అంతేగాక వారు ఆతర్వాత అనేక సందర్భాలలో ఇంజనీర్లుకు, రైల్వే అధికారులకు తన అభిప్రాయమును తెలియజెప్పి మాకు చాలాసహాయంచేసారు.

కలెక్టర్ రిపోర్టు నాధారంచేసికొని, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటులోని పబ్లిక్ శాఖామాత్యులైన శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారి ఆమోదముద్రతో, స్టేటుగవర్నమెంటు వారు తమ అభిప్రాయమును 1962 ఆగస్టు 10వ తేదీన రైల్వే అధికారులకు పంపారు. ఆ అభిప్రాయం - ప్రస్తుతం వున్న రెండు స్టేషనులను ఎత్తివేసి 14/6 కి మీ. వద్ద నూతన స్టేషను యేర్పాటుచేయమని. మేము మద్రాసు వెళ్ళేముందు

అయాచితంగా శ్రీ చెరుకువాడవారు శ్రీ అల్లూరిని గుడివాడలో కలుసుకుని యీ స్టేషనువిషయమై మాటాడటంజరిగింది. అంతే గాక శ్రీనార్ల, శ్రీ అల్లూరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలుగూడా జరిగాయి.

స్టేటు గవర్నమెంటు నూతన స్టేషను ప్రపోజల్‌కు అంగీకారం తెలిపినా రైల్వే అధికారులలో సంచలనంలేదు. గాక పిడుగులాంటి వార్త ఒకటి మాచెవినిపడింది. అది - కవుతరం మెయిన్ స్టేషనువద్దనే నూతన భవనములను కట్టబోతున్నారని, వాటి శంఖుస్థాపన 1961 సెప్టెంబరు 22వ తేదీన అని. ఇంక మాకు తొందరవుట్టింది. వెంటనే నేను, కానూరి వెంకటాద్రియ్యగారు మద్రాసు వెళ్ళాము. 19వ తేదీన డిప్యూటీ కమర్షియల్ సూపరింటెండెంటు [డెవలప్‌మెంటు] ను కలుసుకున్నాము. సవిస్తరంగా జరిగిన వృత్తాంతాన్నంతటిని వారికి వివరించాము. ఆయనగారు సావకాశంగావిన్నారు. వారుయేమి చేయనున్నారో మాకు తెలియదు. కాని చేసింది మాత్రం మహోపకారం. మేము కలిసినరోజునే కవుతరం మెయిన్ స్టేషను వద్ద జరుగుతున్న అభివృద్ధిపనులను ఆపివేయవలసినదని టెలిగ్రాము యిప్పించారుట. అంతేగాక 14/6 కి.మీ. వద్ద నూతనంగా స్టేషనును నిర్మించుటకు అయ్యే ఎస్టిమేట్ విలువలను తయారుచేసి పంపవలసినదని తనతోటి అధికారులకు తెలియజేసారుట. ఈ నూతన స్టేషను చరిత్రగతిలో ఆనాడొక మలుపు. ఆరోజు సువర్ణాక్షరాలతో లిఖింపదగినది. అది 1961 సెప్టెంబరు 19వ తేదీ. ఆడిప్యూటీ కమర్షియల్ సూపరింటెండెంట్ [డెవలప్‌మెంటు] చిరస్మరణీయులు. వారు శ్రీ వి. కె. స్థానునాథన్.

కాని అంతటితో అవరోధాలు ఆగిపోలేదు. నూత్న స్టేషను నిర్మాణమునకు యెక్కువవ్యైకం అవుతుందన్న విషయంమీదనైనా త్రోసివేస్తారన్న భయసందేహములు మాలో కలుగక పోలేదు, గాక కొంతమంది రైల్వే అధికారులుగూడా అదే అభిప్రాయమును వెలిబుచ్చారు. అందుచేత కలుసుకోవాలనుకున్న ఆఫీసర్ల నందరినీ మరల మరల కలుసుకున్నాము చీఫ్ కమ్మర్షియల్ సూపరింటెండెంటు అయిన శ్రీ జె బి. రావును కలుసుకున్నాము ఆయన ఆంధ్రుడు అంతేగాక వారు బాపినీడుగారికి, మన పింగళివారికి, చిరపరిచితులుఅవటం మన అదృష్టం. మద్రాసు ఆఫీసులో లెక్కల మదింపుసాఫీగా నడిచింది. నూతనరైల్వే స్టేషనుల నిర్ణేతలు జనరల్ మేనేజర్ (S.R.) అయినప్పటికి మన సమస్య రైల్వేబోర్డు దృష్టినుండి తేబడ్డదిగనుక వారి ఆమోదానికి సదరన్ రైల్వేవారు పంపారు. ఢిల్లీలో అక్కౌంటెంట్ జనరల్ (సెంట్రల్ రివిన్యూస్) హోదాలో మన పింగళివారు వుండనే వున్నారు. వారు రైల్వేబోర్డు మెంబర్లతోను, ఉద్యోగస్తులతోను, తనకు గల పరిచయాన్ని పురస్కరించుకుని మరల మన స్టేషను విషయమై జ్ఞప్తికి తెచ్చారు. అంతట 14/6 కి. మీ. వద్ద నూతన స్టేషనును నిర్మించుటకు అంగీకరించుచూ, అందుకు తగిన చర్యలు తీసికొనవలసినదని సదరన్ రైల్వేవారికి రైల్వేబోర్డు వారు ఉత్తర్వులు పంపారు అంతేగాక వారు ఆవిషయాన్ని శ్రీనాగ్లకు 1961 డిశెంబరు 9వ తేదీన, మాకు డిశంబరు 23న తేదీన తమ N-61-TG ii/1/S/3 O A iii రు ద్వారా తెలియజేసారు. ఆశుభవార్తవిని గ్రామస్తులంతా సంతోషించారు. ఇంకెట్టి అవరోధాలు వుండవని మేము అనుకున్నాము. మరల రానే వచ్చింది పెద్ద అవరోధం, అది- రైల్వే బోర్డు

సన్నయాన్ని గూడా తిరుగదోడుటకు మంత్రివర్గ లెవెల్లో తీవ్రమైన కృషిజరిగటం.

---

ఆఖరికి ప్రతిపక్షం చేత లోక్‌సభలో యీ విషయం మీద చర్చ తీసుకొనిరావటం తప్ప మరొక మార్గం కనుపించలేదు. మార్కాపురం నియోజక వర్గంనుంచి యెన్నికైన కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటు మెంబరు అయిన శ్రీ గుజ్జుల యల్లమందారెడ్డికి చెప్పగా అయనగారు 1952 మే నెలలో జరిగిన రైల్వే బడ్జెటుకు సంబంధించి డిమాండ్సు పైగల కోత తీర్మానంలో యీ స్టేషను విషయాన్ని ప్రవేశపెట్టారు. అంతే గాక శ్రీ నార్ల రాజ్యసభసమావేశములకు ఆ మే నెలలోనే వెళ్ళినప్పుడు రైల్వే డిప్యూటీ మంత్రి శ్రీ రామస్వామి గారిని కలుసుకొని మాట్లాడటం జరిగింది ఆ మంత్రిగారిని గుడివాడ, బందరు ప్రోగ్రాములో కలుసుకొని మాటాడవని శ్రీ నార్ల మాకు ఉత్తరం వ్రాసారు. ఆ ప్రకారం మే 30 వ తేదీన గుడివాడ ప్లాట్‌ఫారం మీద ఆ డిప్యూటీ మంత్రి గారిని కలుసుకున్నాము. వారి సంభాషణ సుముఖంగా లేదు. పైపెచ్చు ఒక కేంద్రమంత్రి అడ్డు తగిలినట్లు ద్యోతకమైనది. శ్రీ నార్లకు రామస్వామి గారితోగల పరిచయాన్ని పురస్కరించుకొని నార్లవారి కృషికి సంబంధించినది మా ప్రపోజల్ అని తెలియపరచి వారిని కలుసుకోమన్న నార్లవారి ఉత్తరము వారికి వారికి చూపాము, అప్పుడు వారు విషయ పరిశీలన ప్రారంభించారు. అచ్చట నున్న జనరల్ మేనేజర్, డివిజనల్ సూపరింటెండెంటును అడిగి వివరాలు తెలుసుకున్నారు. అంతటితో మేము ఆగలేదు. జగమెరిగిన డాక్టర్ కె. యల్. రావు (బెజవాడ యం. పి.) గారిని అదే రోజున బెజవాడలో

కలుసుకొని మాట్లాడినాము. వారు గూడా తమ అభిప్రాయమును శ్రీ రామస్వామిగారికి తెలిపారు. అంతటినుంచి ప్రధానమైన మార్పు వచ్చింది. ముఖ్యంగా మంత్రి వర్యులలో మార్పు రావటానికి శ్రీ నార్ల వ్యక్తిత్వం ప్రధాన కారణం.

ఎట్టకేలకు 11/6 కి. మీ. వద్ద నూతన స్టేషన్ నిర్మాణమునకు పని ప్రారంభించవలసినదని 1962 సెప్టెంబరులో రైల్వే అధికారులనుంచి ఇంజనీరింగు అధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. 1962 డిశెంబరు 15 వ తేదీనుంచి పని ప్రారంభించారు. నేటికి పని పూర్తిఅయి సర్వాలంకరణతో కూడిన నూతన స్టేషను ప్రారంభోత్సవం జరుపుకుంటున్నాము.

ఇంకో విషయం ప్లాట్ ఫారం పట్టాల లెవెల్ ప్లాట్ ఫారం అని తెలిసింది. దానివల్ల అనేక చిక్కులు, అపాయములు జరుగునని హైలెవెల్ ప్లాట్ ఫారం కావాలని డివిజినల్ సూపరింటెండెంటు, డిప్యూటీ ఛీఫ్ యింజనీర్లను కోరాము. వారు అందుకు సానుభూతి చూపారు. కాని 18 అం॥ ఎత్తుగల మీడియమ్ లెవెల్ ప్లాటుఫారంను యేర్పాటు చేస్తామని తెలియజేసారు. అయినా ప్రయాణీకులకు సౌకర్యంగా వుండగలదని భావించాము. దాన్ని గూడా నిర్మించారు. అంతేగాక పంచాయతీవారు కోరినదే తడవుగా— రైల్వేవారు తమ మార్జిన్‌లో బూరగడ్డాంక మెటల్ రోడ్డు నుండి వడ్డిచెర్వు డొంక మెటల్ రోడ్డును కలుపు అప్రోచ్ రోడ్డును వేసికొనుటకు పంచాయితీవారికి పర్మిషన్ యిచ్చారు.

అధికారులతో గాని, అనధికారులతో గాని జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల సంఖ్య 85, అధికారులవద్ద పెరిగిన యీ స్టేషన్ ఫయిల్ "మహాభారత" మంత అయింది. ఇలా

మనం అనుకోవటమే కాదు, మేము కలిసినప్పుడు ఒక సీనియర్ ఆఫీసరు నవ్వుతూ అన్నారుకూడా. ఎంతోమంది మహామహులు పాల్గొన్నారు. కాని కురుక్షేత్రం కాలేదు. కాదు కూడా. అదే కవుతరం ప్రజల విజ్ఞత, ప్రత్యేకత.

## ప్రశంసలు :

నూతన స్టేషన్ యేర్పాటులో వ్యయ ప్రయాసలకు లోనై ప్రతి ఘట్టంలోను పూనుకున్నవారు.- శ్రీ కానూరి వెంకట్రామయ్యగారు. ఇంకా యీ ఉద్యమంలో అప్పుడప్పుడు పాల్గొన్నవారు శ్రీ తాళ్ళూరి అప్పారావు, శ్రీ కానూరి వెంకటపతి, శ్రీ కానూరి సుబ్బారావు (తండ్రి నారాయణమూర్తిగారు), అర్జీలు ఇంగ్లీషు డ్రాఫ్టింగులో తోడ్పడినవారు - శ్రీ బసవరాజు నాగభూషణంగారు. మొద నుంచి యీ ఉద్యమానికి మాట సహాయం, ప్రోత్సాహం యిచ్చి, ఆర్థికంగా తోడ్పడిన వ్యక్తులు. ప్రజలు లేకపోలేదు. వారిలో ముఖ్యులు శ్రీ గుళ్ళపల్లి చక్రపాణి. శ్రీ చాపరాల సుబ్బారావు, శ్రీ కానూరి వెంకటేశ్వరరావు, (తండ్రి శేషయ్యగారు). శ్రీ తూము సూర్యనారాయణగార్లు వీరంతా ప్రశంసా పాత్రులు

## కృతజ్ఞతాభివందనములు :

మంత్రులతో శ్రీ నాయక్కు, ఢిల్లీ అధికారులతో శ్రీ పింగళివారికి, మద్రాసు అధికారులతో శ్రీ బాపినీడుగారికి గల పరిచయాలవల్లనే మనం యీ విషయంలో సఫలీకృతులము కాగలిగాము, వారికి మా హృదయపూర్వకకాభివందనములు. అంతేగాక వాక్ సహాయము చేసిన డాక్టర్

కె. యల్. రావుగారికి, శ్రీ గుజ్జుల యలమందారెడ్డిగారికి, శ్రీ అడ్సుమిల్లి సుబ్బారావుగారికి (గుడివాడ) మా హృదయ పూర్వకాభివందనములు.

మనపాలిట బృహత్ కార్యమనదగిన యీ స్టేషను యేర్పాటును గురించి ప్రతిదశలోను సుహృద్భావాన్ని ప్రకటించి సహాయం చేసిన రైల్వే డిపార్టుమెంటువారికి ముఖ్యముగా సదరన్ రైల్వేవారికి మా కృతజ్ఞతాభి వందనములు, అంతేగాక అందచందాలతో ఉట్టిపడే యీ స్టేషను భవనాలను నిర్మించి మా కోరికను యీడేర్చిన యింజనీరింగు డిపార్టుమెంటువారికి గూడా మా ప్రత్యేకాభి వందనములు.

నూతన స్టేషను సత్సంకల్పమని ప్రశంసించి, మమ్ములను ప్రోత్సహించి, కార్యశూరులను చేసి బిడ్డల వెంటబెట్టుకున్న తండ్రిలాగా మమ్ములను తమవెంటబెట్టుకొని మద్రాస్ తీసుకొనివెళ్ళి అచ్చట శ్రీ మాగంటి బాపినీడు వంటి పెద్దలతో మమ్ములను పరిచయం చేసిన మన శ్రేయోభిలాషులు, గురువులు అయిన శ్రీ చెరుకువాడ వెంకట నరసింహం పంతులుగారు మనలను దుఃఖాంబుధిలో ముంచి యీ లోకాన్ని విడనాడి కీర్తిశేషులైనారు, వారు యీ సందర్భంలో లేకుండా పోవటం తీరనిలోటు. అంతేగాక—1963 నవంబరు 1 వ తేదీన స్టేషను ప్రారంభోత్సవం జరుగుతుందనుకున్నప్పుడు ఆ ఉత్సవానికి యెంత రుగ్మతలో వున్న తప్ప

కుండా వస్తానని వుత్తరం వ్రాసారు. అప్పుడు కొన్ని కార ణాంతరాలవల్ల ప్రారంభోత్సవం జరుగలేదు, అందుచేత మనం మరింత దురసిల్లవలసి వచ్చింది. అట్టి అనుసంధానకర్త, మన శ్రేయోభిలాషికి, పబ్లిక్ శాఖామాత్యులుగ వుండి మనకు తోడ్పడిన కీర్తిశేషులైన శ్రీ అల్లూరి సత్యనారా యణరాజు గార్లకు మాహార్దికాభివందనములను యెలా అందచేయగలము ?

## —: అనుబంధము :—

| విరాళములు యిచ్చినవారు | స్టేషన్ యేర్పాటుకు విరాళములు |
|---|---|
| శ్రీ కానూరి వెంకట్రామయ్యగారు | 374-00 |
| శ్రీ తాళ్ళూరి అప్పారావుగారు | 153-00 |
| శ్రీ కానూరి వెంకటపతిగారు | 106-00 |
| శ్రీ చాపరాల సుబ్బారావుగారు (తండ్రి సత్యనారాయణగారు) | 100-00 |
| శ్రీ చాపరాల వెంకట అప్పారావుగారు | 50-00 |
| శ్రీ కానూరి వెంకటేశ్వరరావుగారు తండ్రి శేషయ్యగారు | 94-00 |
| శ్రీ తూము సూర్యనారాయణగారు | 30-00 |

| | |
|---|---|
| శ్రీ తాళ్ళూరి మంగపతిరావు | 53-00 |

మొక్కలు యిచ్చినవారు

| | |
|---|---|
| శ్రీ కానూరి వారి ధర్మాదాయ సంఘంవారుయిచ్చినమామిళ్లు 60 | 60-00 |
| శ్రీ తాళ్ళూరి అప్పారావుగారు యిచ్చిన క్రోటన్ మొక్కలు 84 | 50-00 |
| | 1070-00 |

నూతన స్టేషన్ యేర్పాటుకు మనకైన జమ ఖర్చులు.

| | | జమ. | ఖర్చు. |
|---|---|---|---|
| (1) | విరాళములు | 960-00 | |
| (2) | ప్రయాణములు | | 833-47 |
| (3) | పోస్టేజి | | 53-09 |
| (4) | స్టేషనరీ | | 8-44 |
| (5) | మిస్ లేనియస్ | | 65-00 |
| | | 960-00 | 960-00 |

నూతన స్టేషన్ నిర్మాణమునకు ప్రభుత్వానికి అయిన షుమారు ఖర్చులు.

| | | |
|---|---|---|
| (1) | బ్రిడ్జీలు నాలుగింటికి | 47,000 |

| | | |
|---|---|---|
| (2) | స్టేషన్ బిల్డింగ్‌కు | 36,000 |
| (3) | స్టాఫ్ క్వార్టర్సుకు | 50,000 |
| (4) | గూడ్స్‌షెడ్, అప్రోచ్ రోడ్లు, లైటిన్, ప్లాట్‌ఫారములు, మట్టిపని | 2,27,000 |
| (5) | విద్యుచ్ఛక్తి లైటింగ్‌కు | 13,000 |
| (6) | సిగ్నల్సు, కాబిన్‌లు | 2,37,000 |
| (7) | ఎక్వయిరీ చేసిన య 9-86 కి. | 40.000 |
| | | 6,50,000 |

ఇట్లు,

కవుతరం, 20-9-64.

తాళ్లూరి మంగపతిరావు,
కార్యకర్త:
కవుతరం నూతన రైల్వే స్టేషన్ ఉద్యమ సంఘం.

అశోకా ఆర్టు ప్రెస్, గుడివాడ.